క్లుప్తంగా

కమ్యూనిటీహాల్‌కు మరమ్మతు చేయాలి

మీర్‌పేట: లెనిన్‌నగర్‌లోని హుడా కమ్యూనిటీ హాల్‌కు ప్రహరీ నిర్మించాలని హుడాకాలనీ బస్తీ కమిటీ ఆధ్వర్యంలో గురువారం మహేశ్వరం ఎమ్మెల్యే సబితాఇంద్రారెడ్డికి వినతిపత్రం అందజేశారు. కమ్యూనిటీహాల్‌కు మరమ్మతులు, ప్రహరీ నిర్మించాలని గతంలో మున్సిపల్ పాలకవర్గానికి విన్నవించామని, అయినప్పటికీ సమస్య పరిష్కారం కాలేదని బస్తీ కమిటీ నాయకులు ఎమ్మెల్యే దృష్టికి తెచ్చారు. స్పందించిన ఎమ్మెల్యే కమ్యూనిటీహాల్‌కు సంబంధించిన పనులను వెంటనే చేపట్టాలని కార్పొరేషన్ అధికారులను ఆదేశించినట్లు తెలిపారు. కార్యక్రమంలో బస్తీ కమిటీ అధ్యక్షుడు మహేశ్, ఉపాధ్యక్షుడు నాగరాజు, కార్యదర్శి ఆంజనేయులు, కోశాధికారి జి.దశరథ్, సలహాదారు నవీన్‌కుమార్ పాల్గొన్నారు.

కొలువుదీరిన ఆలయ పాలకవర్గం


ప్రమాణ స్వీకారం చేస్తున్న నూతన పాలకమండలి సభ్యులు

పహాడీషరీఫ్: మామిడిపల్లిలోని శ్రీబాలాజీ వేంకటేశ్వరస్వామి ఆలయ నూతన పాలకమండలి సభ్యులు గురువారం ప్రమాణస్వీకారం చేశారు. దేవాదాయ, ధర్మాదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ ప్రణీత్‌కుమార్, ఈవో మురళీకృష్ణ ఈ సందర్భంగా కమిటీ చైర్మన్ కల్లెం నరేశ్‌గౌడ్, డైరెక్టర్లు చీమలదరి చెన్నయ్య, గొండ్యాల శేఖర్‌ముదిరాజ్, కానుగుల భాస్కర్, గుర్జని రాధిక, ఏ.అనిత, ఎక్స్‌అఫీషియో సభ్యుడు యు.సుధీర్‌లతో ప్రమాణం చేయించారు. ఏడాది కాల పరిమితితో ఈ కమిటీ కొనసాగనుంది. మహేశ్వరం నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి కిచ్చన్నగారి లక్ష్మారెడ్డి ముఖ్య అతిథిగా హాజరై పాలకమండలి సభ్యులకు అభినందనలు తెలియజేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకులు గోవర్ధన్‌రెడ్డి, లాల్ సతీష్‌గౌడ్, విజయ్‌గౌడ్, గ్రామపెద్దలు ఎడ్ల వాసుదేవారెడ్డి, కె.నందీశ్వర్‌లతో పాటు మంఖాల భాస్కర్, లాల్ జగదీశ్ గౌడ్, గుర్జని శ్రీనివాస్‌గౌడ్, ప్రవీణ్‌గౌడ్, ఆదిల్ల రజనీకాంత్, కాసాని సిద్ధు తదితరులు పాల్గొన్నారు.

పడకేసిన పారిశుద్ధ్యం


వాదే ముస్తఫా బస్తీలో పారుతున్న మురుగునీరు

పహాడీషరీఫ్: జల్‌పల్లి మున్సిపాలిటీలోని వాదే ముస్తఫా బస్తీలో పారిశుద్ధ్యం పడకేసింది. రోజుల తరబడిగా మురుగునీరు రోడ్లపై పారడం.. ఎక్కడ పడితే అక్కడ చెత్తకుప్పలు పేరుకుపోవడంతో దోమలు విజృంభించి స్థానికులు అనారోగ్యాలకు గురవుతున్నారు. ఏటా ఈ బస్తీలో డెంగీ వ్యాధి సోకి మరణాలు సంభవించడం పరిపాటిగా మారింది. గత అనుభవాలను దృష్టిలో ఉంచుకొని మున్సిపాలిటీ అధికారులు వర్షాకాలంలో ప్రత్యేక దృష్టిసారించాల్సిన అవసరం ఉందని స్థానికులు కోరుతున్నారు.

యోగాతో మానసికోల్లాసం

– మాజీ ఎంపీ తూళ్ల దేవేందర్‌గౌడ్

తుక్కుగూడ: యోగాతో మానసికోల్లాసం, శారీరక దృఢత్వం పెంపొందుతుందని మాజీ ఎంపీ తూళ్ల దేవేందర్‌గౌడ్ అన్నారు. గురువారం పురపాలిక కేంద్రంలోని దేవేంద్ర విద్యాలయంలో స్వా–స్వామి శక్తి ఆధ్వర్యంలో విద్యార్థులకు యోగా తరగతులు నిర్వహించారు. తరగతులను ఆయన ప్రారంభించి మాట్లాడారు. యోగా ద్వారా శ్వాస అనేది రోజు వారి జీవితంలో అంతర్గత శక్తిని పెంపొదిస్తుందన్నారు. ప్రతి ఒక్కరూ యోగా చేయడం అలవాటు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఆ సంస్థ వ్యవస్థాపకురాలు ఉష, దేవేంద్ర విద్యాలయ డైరెక్టర్ తూళ్ల విజయేందర్‌గౌడ్, తూళ్ల శ్వేత, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

డ్రైనేజీల్లో చెత్తాచెదారం తొలగింపు


డ్రైనేజీ శుభ్రం చేయిస్తున్న నాయకుడు శేఖర్‌రెడ్డి

బడంగ్‌పేట్: కార్పొరేషన్ పరిధిలోని 5వ డివిజన్ వినాయకహిల్స్ కాలనీలో ఇటీవల వర్షాలకు డ్రైనేజీలు చెత్తా చెదారాలతో నిండి పొంగి పొర్లుతున్నాయి. విషయం తెలుసుకున్న స్థానిక బీఆర్ఎస్ నేత బోయపల్లి శేఖర్‌రెడ్డి మున్సిపల్ కార్పొరేషన్ శానిటేషన్ సిబ్బందిని పిలిపించి గురువారం డ్రైనేజీలు శుభ్రం చేయించారు. సమస్య పరిష్కారానికి కృషిచేసిన శేఖర్‌రెడ్డికి కాలనీవాసులు కృతజ్ఞతలు తెలిపారు.

లీకేజీ ఇలా.. ప్రాక్టీస్ ఎలా?

అధ్వానంగా ఇండోర్ స్టేడియం

- చిన్నపాటి వర్షానికే కురుస్తున్న పైకప్పు
- తడిసి ముద్దవుతున్న ఉడెన్ ఫ్లోరింగ్
- రూ.రెండు కోట్లు వెచ్చించినా.. ఫలితం శూన్యం


ధారగా కారుతున్న వర్షపు నీటి కింద బకెట్ పెట్టిన సిబ్బంది


ధ్వంసమైన పై కప్పు భాగం

హుడాకాంప్లెక్స్: అంతర్జాతీయ ప్రమాణాలకు దీటుగా తీర్చి దిద్దామని చెప్పుకుంటున్న సరూర్‌నగర్ ఇండోర్ స్టేడియం చిరుజల్లులకు సైతం కురుస్తోంది. తడిసి ముద్దవుతోంది. ఇప్పటికే శిథిలావస్థకు చేరిన స్టేడియానికి ఏడాది క్రితం రూ.2 కోట్లు వెచ్చించి, పునర్నిర్మాణ పనులు చేయించారు. అయినా ఫలితం శూన్యం. లీకేజీ కొనసాగుతూనే ఉంది. ఆటల సమయంలో క్రీడాకారులకు గాయం కాకుండా ఉండేందుకు నేలపై ఏర్పాటు చేసిన ఖరీదైన ఉడెన్ ఫ్లోరింగ్ దెబ్బతింటోంది. వర్షపు నీటితో తడిసిన ఉడ్‌పై కాలు పెడితే.. కుంగిపోయి.. క్రీడాకారులను గాయాల పాలు చేస్తోంది. దీంతో ఆటగాళ్లు ఇబ్బందులకు గురవుతున్నారు. ప్రాక్టీస్ ఎలా చేసుకోవాలని వాపోతున్నారు.

ప్లాస్టిక్ కవర్లు కప్పి..

ఔత్సాహిక క్రీడాకారులకు శిక్షణ ఇప్పించి, ఆయా ఆటల్లో వారిని ప్రోత్సహించేందుకు 2001లో నాటి ప్రభుత్వం.. 17 ఎకరాల విస్తీర్ణంలో సరూర్‌నగర్ స్టేడియాన్ని నిర్మించింది. ఇదే ప్రాంగణంలో కెనడా సాంకేతిక పరిజ్ఞానంతో ఇండోర్ స్టేడియాన్ని నెలకొల్పింది. నిర్వహణ లోపం, నాసికరం పనుల వలన ఇప్పటికే పైకప్పు దెబ్బతింది. దీంతో రెండేళ్ల క్రితం అప్పటి ప్రభుత్వం రూ.2 కోట్లు వెచ్చించి, ఆధునీకరణ పనులు చేయించింది. జిమ్నాస్టిక్, టెన్నిస్, కరాటే, బాక్సింగ్ తదితర ఆటలకు ఉడెన్ ఫ్లోరింగ్ కోర్టులను ఏర్పాటు చేయించింది. నాసిరకం పనులతో మళ్లీ ధ్వంసమైంది. చిన్నపాటి వర్షానికే స్టేడియంలోకి ధారలుగా వర్షపు నీరు కారుతోంది. విధిలేని పరిస్థితుల్లో సిబ్బంది నీటి ధారల కింద బకెట్లను ఉంచి, ఎత్తిపోస్తున్నారు. ప్లాస్టిక్ కవర్లు కప్పినా ఫలితం ఉండటం లేదు. ఈదురు గాలికి అవి ఎగిరిపోతున్నాయి. నిరంతరం పర్యవేక్షణ లేకపోవడంతో బకెట్లు నిండిపోయి ఫ్లోరింగ్ తడిసిపోతోంది. మైదానం మొత్తం నీటితో నిండిపోతోంది.

ఇబ్బందిగా ఉంది



నిత్యం టెన్నిస్ ప్రాక్టీస్ చేసేందుకు స్టేడియానికి వస్తుంటాం. మైదానంలో నీళ్లు నిండి ఉండటంతో ఇబ్బంది కలుగుతోంది. దెబ్బతిన్న భాగాన్ని వెంటనే పునర్నిర్మించాలి. ఇండోర్ స్టేడియంలోకి నీరు చేరకుండా తగిన ఏర్పాట్లు చేయాలి.

– శేఖర్‌నేత, క్రీడాకారుడు

కొంతభాగం మారుస్తాం



గతంలో మరమ్మతు పనులు చేసిన కాంట్రాక్టర్ సరిగా చేయలేదు. పై కప్పు కొంతభాగాన్ని మార్చాల్సి ఉంది. ఈ అంశాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. త్వరలో పునర్నిర్మాణ పనులు చేయిస్తాం. క్రీడాకారులకు ఇబ్బంది కలగకుండా చూస్తాం.

– వెంకటేశ్వర్‌రావు, జిల్లా క్రీడలశాఖ అధికారి

అలుగుపారుతున్న అంతిరెడ్డి చెరువు


అలుగు పారుతున్న చెరువు


నిండుకుండలా కుర్మల్‌గూడలోని అంతిరెడ్డి చెరువు

బడంగ్‌పేట్: కార్పొరేషన్ పరిధిలోని కుర్మల్‌గూడ అంతిరెడ్డి చెరువు ఇటీవల కురిసిన వర్షాలకు నిండు కుండలా మారి మత్తడి (అలుగు) పారుతోంది. ఈ చెరువు సుందరీకరణ చేపట్టేందుకు నిధులు మంజూరు కాగా వాటితో కొంత మేర చెరువుకట్టపై బారికేడ్లు ఏర్పరచారు. చెరువు కట్ట పనులు కొనసాగుతున్నాయి. చెరువు అలుగు పారుతుండటంతో స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. చేపల ప్రియులు గాలలు వేసి చేపలు పట్టే పనిలో నిమగ్నమయ్యారు.

అనాథాశ్రమానికి సరుకుల అందజేత


దివ్యాంగుల ఆశ్రమంలో విద్యార్థులు, సిబ్బంది

బడంగ్‌పేట్: మీర్‌పేట్‌లోని నాగార్జున మాంటిస్సోరి ఐఐటీ ఒలంపియాడ్ స్కూల్ విద్యార్థులు కార్పొరేషన్ పరిధిలోని నాదర్‌గుల్ మాతృదేవోభవ అనాథ మానసిక దివ్యాంగుల ఆశ్రమానికి గురువారం నిత్యావసర సరుకులు వితరణ చేశారు. అలాగే నాగార్జున విద్యాసంస్థల చైర్మన్ గుమ్మికొండ విఠల్‌రెడ్డి జన్మదినాన్ని దివ్యాంగుల మధ్య జరుపుకున్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ కె.విజయకుమార్, ఇన్‌చార్జిలు దుర్గ, రాధిక, సంధ్య, ప్రశాంతి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మినీ ట్యాంక్‌బండ్‌కు మరమ్మతులు చేపట్టాలి


ట్యాంక్‌బండ్‌ను పరిశీలిస్తున్న కార్పొరేటర్

హుడాకాంప్లెక్స్: ఏటా వినాయక చవితి వస్తుందని తెలిసినా అధికారులు, ప్రభుత్వం నిమ్మకు నీరెత్తన్నట్లు వ్యవహరిస్తూ.. సదుపాయాలు చేయకుండా హిందువుల పండుగలను చిన్నచూపు చూస్తున్నారని సరూర్‌నగర్ డివిజన్ కార్పొరేటర్ ఆకుల శ్రీవాణి ఆరోపించారు. గురువారం ఆమె సరూర్‌నగర్ మినీ ట్యాంక్‌బండ్‌ను సందర్శించారు. చెరువు కట్టపై గుంతలను, బండ్ పగుళ్లను పరిశీలించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. ఎక్కడైనా వినాయక విగ్రహాలు తేవడం నుంచి నిమజ్జనం వరకు భక్తులకు ఇబ్బందులు కలిగితే ఊరుకోమన్నారు. రోడ్ల మరమ్మతులు, డ్రైనేజీలు, మండపాల వద్ద సదుపాయాలు, విగ్రహాల రాకపోకల దారుల్లో చెట్లకొమ్మలు, విద్యుత్ వైర్లు తొలగించడం, నిమజ్జనానికి మార్గం సుగమం చేయడం ఎంతో అవసరమన్నారు. సరూర్‌నగర్ చెరువు బండ్ విరిగిపోయే ప్రమాదం ఉందని, ఎన్ని నెలలుగా సూచనలు ఇచ్చినా అధికారులు నిద్రపోతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంటనే మరమ్మతులు చేపట్టాలని కోరారు.

నేడు పనుల జాతర

కందుకూరు: జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకంలో పూర్తి చేసిన పనులు, చేపట్టాల్సిన అభివృద్ధి పనులను ప్రారంభించడానికి శుక్రవారం పనుల జాతర కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ సరిత గురువారం తెలిపారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రతి గ్రామంలో పూర్తి చేసిన పనులను ప్రారంభించనున్నామన్నారు. కొత్తగా నిధులు మంజూరైన పనులకు శంకుస్థాపనలు చేస్తామన్నారు. గత ఆర్థిక సంవత్సరంలో ఎక్కువ రోజు పనిచేసిన దివ్యాంగుల కుటుంబాలను గుర్తించి సన్మానం, నిబద్ధతతో పనిచేసిన పారిశుద్ధ్య కార్మికులను గుర్తించి సన్మానిస్తామన్నారు. అందరూ పాల్గొని సహకరించాలని ఆమె కోరారు.

జోనల్‌స్థాయి క్రీడలు ప్రారంభం


కబడ్డీ ఆడుతున్న బాలికలు

మలక్‌పేట: హైదరాబాద్ జిల్లా స్కూల్ గేమ్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో గురువారం 69వ ఇంటర్ జోనల్ క్రీడలు సైదాబాద్ జోన్ మూసారంబాగ్ స్వామి వివేకానందా సెంటనరీ హైస్కూల్లో నిర్వహించారు. మూసారంబాగ్ కార్పొరేటర్ బొక్క భాగ్యలక్ష్మి, సైదాబాద్ కార్పొరేటర్ కొత్తకాపు అరుణ, సైదాబాద్ డిప్యూటీ ఈవో సుకన్య హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. విద్యార్థుల్లో క్రీడా స్ఫూర్తిని పెంపొందించాల్సిన అవసరం ఉందన్నారు. ఆటలతో దేహదారుఢ్యం, మానసికోల్లాసం కలుగుతుందన్నారు. చదువుతో పాటు క్రీడలు ముఖ్యమన్నారు. ఈ కార్యక్రమంలో ఓం హరికృష్ణ, వరప్రసాద్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, శ్రీదేవి, శివకుమార్ పాల్గొన్నారు.

'ఓనస్'లో అరుదైన శస్త్రచికిత్స

సైదాబాద్: చంపాపేటలోని ఓనస్ హాస్పిటల్‌లో అరుదైన శస్త్రచికిత్స నిర్వహించారు. గురువారం హాస్పిటల్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎండీ బాలరాజు నాయుడు వివరాలు వెల్లడించారు. రంగారెడ్డి జిల్లా మాడ్గుల మండలం ఇర్వేన్ గ్రామానికి చెందిన గీత కార్మికుడు బి.నాగయ్యగౌడ్ అనారోగ్య సమస్యలతో బాధపడుతూ ఇంటి వద్ద హఠాత్తుగా సొమ్మసిల్లి పడిపోయాడు. చికిత్స నిమిత్తం ఓనస్‌కు తరలించగా పరిశీలించిన వైద్యబృందం అతడి మెదడులో రక్తస్రావం అయినట్లు గుర్తించి అత్యాధునిక ఎండోవాస్కులర్ విధానంతో మెదడులో స్టంట్ వేసే అరుదైన శస్త్రచికిత్సను విజయవంతంగా నిర్వహించారు. రోగికి ఇలాంటి పరిస్థితుల్లో ఓపెన్ బ్రెయిన్ సర్జరీ చేస్తారని కానీ తమ వైద్య బృందం అరుదైన విధానంలో అతడికి శస్త్రచికిత్స చేశామన్నారు. ఈ సమావేశంలో వైద్యులు సూర్యతేజారెడ్డి, మనోజ్ వాసిరెడ్డి, రవికిరణ్ పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి



నాగోలు: వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని ట్రాఫిక్ ట్రైనింగ్ ఇనిస్టిట్యూట్ (టీటీఐ) ఆర్ఎస్ఐ సంతోష్‌కుమార్ తెలిపారు. గురువారం వనస్థలిపురం, ఆటోనగర్, హయత్‌నగర్ బస్టాండ్, అభయ అంజనేయ స్వామి ఆలయం, అంబర్‌పేట్ యుటర్న్, రామోజీ ఫిలిం సిటీ, కవాడిపల్లి రోడ్డు తదితర ప్రాంతాల్లో ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించారు. విద్యార్థులు పాఠశాలకు వెళ్లి వచ్చే సమయాల్లో ట్రాఫిక్ సిగ్నల్స్ వద్దనే రోడ్డు దాటాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎస్‌పీఓ అమరవర్ధన్ రెడ్డి, సిబ్బంది రమేష్ తదితరులు పాల్గొన్నారు.

మద్యంమత్తులో వాహనాలు పడపరాదు..

నాగోలు: మద్యంతాగి వాహనాలు నడిపితే చర్యలు తప్పవని రాచకొండ ట్రాఫిక్ ట్రైనింగ్ ఇన్‌స్పెక్టర్ ఎస్‌పీఓ అమరవర్ధన్‌రెడ్డి అన్నారు. రాచకొండ పోలీస్ కమిషనరేట్ పరిధిలో మద్యం తాగి వాహనాలు నడిపి పట్టుబడిన 98 మందికి గురువారం వారి కుటుంబ సభ్యుల సమక్షంలో కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మద్యం మత్తులో వాహనాలు నడిపితే ప్రమాదాలు జరిగే మీ కుటుంబ సభ్యులతో పాటు ఇతరుల కుటుంబాలు రోడ్డున పడుతాయన్నారు.

వైభవం.. బోనాల ఉత్సవం


ఉత్సవాల్లో ఘటాల ఊరేగింపు


ఉత్సవాల్లో రాచకొండ సీపీ సుధీర్‌బాబు, డీసీపీ సునీతారెడ్డి

మహేశ్వరం: మండల కేంద్రంలో గురువారం పోచమ్మ బోనాల ఉత్సవాలు వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారికి అభిషేకం, అర్చన, కుంకుమార్చన, పుష్పాలంకరణ, మంత్ర పుష్పం వంటి పూజలు చేశారు. గ్రామం మధ్యలో ఉన్న బొడ్రాయికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహిళలు డప్పుచప్పుళ్ల మధ్య బోనాలతో ఊరేగింపుగా ఆలయానికి చేరుకొని అమ్మవారికి నైవేద్యం సమర్పించారు. అమ్మవారి పలహార బండి ఊరేగింపు ఘనంగా నిర్వహించారు. ఉత్సవాల్లో పోతరాజులు, శివసత్తుల విన్యాసాలు, ఘటాల ఊరేగింపు భక్తులను అలరించాయి. గంగపుత్రులు ప్రత్యేకంగా జలపందిరితో బోనాల ఊరేగింపు చేపట్టారు. దీంతో గ్రామంలో బోనాల సందడి నెలకొంది. ఉత్సవాలకు రాచకొండ పోలీస్ కమిషనర్ సుధీర్‌బాబు, డీసీపీ సునీతారెడ్డి, సీఐ వెంకటేశ్వర్లు, ఎస్ఐలు హాజరయ్యారు. కార్యక్రమంలో శివగంగ రాజరాజేశ్వర ఆలయ చైర్మన్ అల్లె కుమార్, మాజీ పీఏసీఎస్ చైర్మన్ పోతర్ల అంబయ్య యాదవ్, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు చంద్రయ్య ముదిరాజ్, కాంగ్రెస్ పార్టీ మండల మాజీ అధ్యక్షుడు కాకి ఈశ్వర్‌ముదిరాజ్, మాజీ వైస్ ఎంపీపీ మునగపాటి స్వప్న, మాజీ సర్పంచ్‌లు కూన యాదయ్య, స్వర్ణగంటి ఆనందం, ప్రియాంక, మాజీ ఎంపీటీసీ సుదర్శన్‌యాదవ్, శివగంగ ఆలయ మాజీ చైర్మన్లు మునగపాటి నవీన్, నిమ్మగూడెం సుధీర్‌గౌడ్, పీఏసీఎస్ డైరెక్టర్లు పోల్కం బాలయ్య, కడమోని ప్రభాకర్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ భిక్షపతి పలువురు పాల్గొన్నారు.

పాఠశాలలో మెరుగైన సౌకర్యాలు కల్పిస్తాం


విద్యార్థులతో నవజీవన్‌రెడ్డి

హయత్‌నగర్: ప్రభుత్వ పాఠశాలలో మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు కృషి చేస్తున్నామని హయత్‌నగర్ డివిజన్ కార్పొరేటర్ నవజీవన్‌రెడ్డి అన్నారు. గురువారం కుంట్లూర్ రోడ్డులో ఉన్న ప్రాథమిక పాఠశాలకు లయన్స్ క్లబ్ సహకారంతో వాటర్ ట్యాంక్‌ను అందజేశారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పాఠశాలలో సమస్యలపై అధ్యాపకులు తన దృష్టికి తీసుకొచ్చారని, పాఠశాలలో పారిశుద్ధ్య నిర్వహణకు సిబ్బందిని పంపుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో అప్పారావుగౌడ్, మల్లారెడ్డి, ప్రశాంత్‌రెడ్డి, రాము, ప్రధానోపాధ్యాయులు వనజ పాల్గొన్నారు.

సీవైఆర్ కాలనీలో అంధకారం

బడంగ్‌పేట్: కార్పొరేషన్ పరిధిలోని అల్మాస్‌గూడలోని సీవైఆర్ కాలనీలో అంధకారం నెలకొంది. కాలనీల్లో స్ట్రీట్ లైట్లు వెలగక నెలకుపైగానే అవుతోందని కాలనీవాసులు వాపోతున్నారు. చీకట్లో వాహనాలకు వేసుకున్న లైట్లతోనే గమ్యస్థానాలకు చేరుకోవాల్సి వస్తోందని, చీకటికి తోడుగా వీధికుక్కలు ఎక్కువ కావడంతో రాత్రి వేళల్లో అవసరాల కోసం బయటకు వెళ్లలేని పరిస్థితి ఉందని కాలనీవాసి నాగరాజు ఆరోపించాడు. చిన్న పిల్లలు బయట ఆడుకోవడానికి బయపడుతున్నారన్నారు. వీధికుక్కల నియంత్రణకు చర్యలు తీసుకోవాలని గతంలో మునిసిపల్ కార్పొరేషన్‌లో ఫిర్యాదులు చేసినా చర్యలు శూన్యమన్నారు. అధికారులు స్పందించి స్ట్రీట్ లైట్లు వేసి కాలనీల్లో వెలుగులు నింపేలా చర్యలు తీసుకోవాలని, అలాగే వీధికుక్కలను పట్టుకుపోవాలని కార్పొరేషన్ అధికారులను వేడుకుంటున్నారు.

పెండింగ్ పనులు పూర్తి చేయాలి


అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే అహ్మద్ బలాల

చాదర్‌ఘాట్: పాత మలక్‌పేట, అజంపురా డివిజన్లలో పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేయాలని మలక్‌పేట ఎమ్మెల్యే అహ్మద్ బలాల ఆదేశించారు. గురువారం అజంపురా పాత మలక్‌పేట డివిజన్లలో పర్యటించిన ఆయన జీహెచ్ఎంసీ వివిధ శాఖల అధికారులు, ఎంఐఎం నాయకులతో పెండింగ్ పనులపై సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ..వర్షాకాలంలో అభివృద్ధి పనుల విషయంలో అలసత్వం వహించవద్దని, చిన్నపాటి నిర్లక్ష్యం పెద్ద సమస్యలకు దారి తీస్తుందన్నారు.అభివృద్ధి పనుల విషయంలో అలసత్వాన్ని సహించబోమని, క్షేత్రస్థాయిలో ఏమైనా ఇబ్బందులు ఉంటే తన దృష్టికి తీసుకు రావాలన్నారు. వర్షాకాలంలో రోడ్లు, డ్రైనేజీ, కలుషిత నీటి సరఫరా వంటి సమస్యలు ఎక్కువగా తలెత్తుతాయని, వాటి విషయంలో వెంటనే స్పందించి వీలైనంత త్వరగా పరిష్కరించాలన్నారు. ఈ కార్యక్రమంలో షఫీ, అబ్రార్, మడీజీఎం హస్మత్‌అలీ పాల్గొన్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్ పేదలకు వరం


చెక్కు అందజేస్తున్న మిద్దెల జితేందర్

చంపాపేట: సీఎం రిలీఫ్ ఫండ్ పేదలకు వరం లాంటిదని తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ సేవాదళ్ అధ్యక్షుడు మిద్దెల జితేదర్ అన్నారు. సికింద్రాబాద్‌కు చెందిన ఉల్లోజు సంపత్‌కుమార్ గొంతు సంబంధిత వ్యాధితో బాధపడుతుండగా అతని బంధువులు స్థానికంగా ఉన్న ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చేర్పించి చికిత్స చేయించారు. రెక్కాడితే కాని పూటగడవని సంపత్‌కుమార్‌కు చికిత్స బిల్లు చెల్లించటం భారంగా మారింది. ఆయన బంధువులు అందినకాడికి అప్పుచేసి ఎట్టకేలకు బిల్లును చెల్లించారు. విషయం తెలుసుకున్న మిద్దెల జితేందర్ బాధితుడితో సీఎం రిలీఫ్ ఫండ్‌కు దరఖాస్తు చేయించగా మంజూరైన రూ.60 వేల చెక్కును గురువారం కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు బండి శ్యాంసుందర్, శ్యామల, రమణి పాల్గొన్నారు.

మన్సూరాబాద్: సీఎం రిలీఫ్ ఫండ్ పేదలకు వరమని మాజీ ఎంపీ మధుయాష్కిగౌడ్ అన్నారు. ఎల్‌బీనగర్‌కు చెందిన బుచ్చమ్మకు రూ.41,500, కర్మన్‌ఘాట్‌కు చెందిన శీతల గజ్బింకర్‌కు రూ.60 వేలు, అయితగోని లోకేష్‌కు మంజూరైన రూ.60 వేల సీఎంఆర్ఎఫ్ చెక్కులను గురువారం ఆయన అందజేశారు.

ఉప్పరిగూడలో ఓపెన్ జిమ్ ప్రారంభం

చంచల్‌గూడ: కుర్మగూడ డివిజన్ ఉప్పరిగూడ ఆజాద్ పార్క్‌లో జీహెచ్ఎంసీ ఏర్పాటు చేసి ఓపెన్ జిమ్‌ను గురువారం యాఖుత్‌పురా ఎమ్మెల్యే జాఫర్ హుస్సేన్ ప్రారంభించారు.అయిఏ గత సోమవారం ప్రారంభించాల్సి ఉండగా ఎంఐఎం నాయకుల పేర్లతో శిలాఫలకం ఉండటంతో బీజేపీ భాగ్యనగర్ జిల్లా అధ్యక్షుడు అనధికారికంగా ప్రారంభించాడు. దీంతో ఎమ్మెల్యే ప్రారంభోత్సవానికి రాలేదు. గురువారం ఉప్పరిగూడ బస్తీకి వచ్చిన ఎమ్మెల్యే జాఫర్‌హుస్సేన్ అధికారికంగా జిమ్‌ను ప్రారంభించారు. ఇదిలా ఉండగా బీజేపీ ఎమ్మెల్సీ పేరు శిలాఫలకంపై లేదని బీజేపీ నాయకులకు ఆందోళనకు దిగారు.